# మినీ కథ

అవి మా వారు స్కూటరు కొన్న క్రొత్త రోజులు. మా ఉత్సాహానికి అంతు ఉండేది కాదు. డ్రైవింగ్ నేర్చుకునేటప్పుడు "ఎల్" బోర్డు తగిలించి స్కూటరు నడపాలి. మావారు నన్ను కూడా ఎక్కించుకుని డబుల్స్ మీద డ్రైవింగ్ చేసేవారు. మాకు ఏ భయం లేకుండా నిశ్చింతగా ఎక్కి తిరిగేవాళ్ళం. మా బంధుమిత్రులంతా మాత్రం హడలి పోయేవారు. ఏం కొంప మునిగిపోయిందని అప్పుడే ఆమెను ఎక్కించుకుని ఊరంతా తిప్పుతున్నావు? ఏ కాలో చెయ్యో ఊడ గొట్టి మూల కూర్చోపెడతావా? నీకు డ్రైవింగ్ చేతనయేవరకు ఆమెను ఎక్కించుకోకని శతవిధాల హెచ్చరించేరు. వారి మాటలు పెడచెవిని పెట్టి మావారు నన్ను ఎక్కమనేవారు. నేను ముందే రెడీ అయేదాన్ని.

ఎంతో స్పీడుగా రయ్యిన వచ్చేస్తున్న లారీ సహితం మా స్కూటరుకున్న 'L' బోర్డు చూసి డెడ్ స్లో అయిపోయేది. మాకు ఘనకార్యం చేసినంత గర్వంగా వుండేవి. ఒక్కోసారి నవ్వువచ్చేది. ఎందుకంటే "సేఫ్టీ ఫస్ట్. స్పీడ్ నెక్స్ట్" అని హెచ్చరిస్తూ గవర్నమెంటువారు పెట్టిన బోర్డులను ఖాతరు చెయ్యని లారీలు మా చిన్న బోర్డు 'L' ని చూసి దడసి 'స్లో' అయేవి. ఇతర వాహనాలైతే దూరంనుంచే హారను మ్రోగిస్తూ అతి స్లోగా మమ్మల్ని దాటి బ్రతుకు జీవుడాని స్పీడు పెంచుకునేవి. ఇక పోతే 'L' బోర్డు వున్న స్కూటర్లను రష్‌గా వుండే మైన్ రోడ్ల మీదకి రానివ్వరు కనుక ప్రక్క ప్రక్క సందులన్నీ మావే. సడన్ బ్రేకులతో, జర్కులిస్తూ సాగే ఆ ప్రయాణం ఒక వింత అనుభూతి అనే అనాలి. ఒకప్రక్క సరదా. మరోప్రక్క భయం. వేరొకప్రక్క గర్వంగాను వుండేది. ఆ రోజులు తలచుకుంటే ఇప్పటికీ ఒక అనుభూతి కలుగుతుంది.

'L' బోర్డు అనతికాలంలోనే తీసేసేరు. అప్పటినుంచి మా వారు దూరప్రయాణాలు దానిపై సాగించేవారు. ఒకసారి వైజాగ్ బంధువులింట్లో పెళ్ళికివెళ్ళేం. కాకినాడలో ఉదయం ఆరు గంటలకు బయలుదేరి దారిలో కాఫీహోటల్స్‌లో సేవిస్తూమజిలీలు చేస్తూ పదిగంటలకు వైజాగ్ చేరేం. ఇంటికి చేరేసరికి అంతా భోజనాల హడావిడిలో వున్నారు. మా స్కూటరు ప్రక్కన పెట్టి లోనికెళ్ళి బంధుమిత్రులందరితో కబుర్లలో పడ్డాం. అర్జంటుగా ఏదో బజార్లో పావలంటూ తేరగావున్న మా స్కూటర్‌ని చిత్తుగా వాడేసేరు. 'మనసులో మాలిన్యం వున్నా మల్లెపూవులా నవ్వడం ఈనాటి తెలివి' అని ఎవరో అన్నట్లుగా మేము మనసులో కుళ్ళుతున్నా పైకి నవ్వుతూ 'వట్టుకెళ్ళండి' అనేవాళ్ళం మొహమాటం అడ్డువచ్చి. మరునటి రోజు పెళ్ళి తంతు లన్నీ ముగిసేక సాయంత్రం వైజాగ్‌లో బయలుదేరాం. మా వారు ఎప్పుడూ




స్కూటర్ టాంకు పెట్రోలుతో నింపివుంచు కునేవారు. వేరేదృష్టిలో వుండి తిరిగిప్రయాణానికి పెట్రోలు సంగతి పట్టించుకోలేదు. సగం దూరం వచ్చేసరికి కదలనని మారాం చేయడం మొదలెట్టింది. దానికి ఎన్నో సేవలుచేస్తే చరికొస్త దూరంచేరి ససేమిరా మా మాట విననంది. అప్పుడు మా పాట్లు భగవంతునికే ఎరుక. చుట్టూ ఎటుచూసినా చీకటిమయం. కీచురాళ్ళ ధ్వని తప్ప మరేమి వినపడలేదు. చిక్కులెప్పుడు ఊరికి ఊరికి మధ్య నిర్మానుష్య ప్రదేశం లోనే పరీక్షించడానికి వస్తాయేమో! పెళ్ళికని బయలుదేరామేమో నా వంటి నిండా వస్తువులు, ఖరీదైన బట్టలతోటి ఉన్నాను. ఆ నిర్జన ప్రదేశంలో ఎవరు నెత్తి మొట్టినా, కత్తిచూపి బెదిరించినా నిలువుదోపిడీ సమర్పించేయాలేగాని వేరే గత్యంతరం లేదు. ఇక ఒంటరితనం చూసి ఏ రౌడీలేనా అవమానానికి పాలుపడితే అనే ఆలోచన వచ్చేసరికి గుండె గుభేలుమనిపోయేది.

ఏ చప్పుడు వినబడ్డా భయంగా ఉండేది. ఆ రాత్రికి స్కూటరు తాళం వేసి ఎక్కడేనా తల వాల్చుకుందామన్నా కనీసం మూడు మైళ్ళు నడిస్తేగాని ప్రక్క ఊరు రాదు. మా వారు చిరాకుతో "ఆడ వాళ్ళతో ప్రయాణాలిలాగే తగలడతాయి. తొందరగా తెమలమంటే ఊడిపడ్డావు కాదంటూ" స్కూటరుమీది కోపం నామీదకు మళ్ళించేరు. 'గుడ్డిలో మెల్ల' అన్నట్టు మా అదృష్టం బాగుండి కొంత సేపటికి ఒక రెండెడ్ల బండి అటే వస్తోంది. దాన్ని ఆపి మాకు వచ్చిన కష్టం అతనికి చెప్పి బండి ఎక్కి కూర్చున్నాం. రాత్రి పూట ఫుల్‌గా తాగి ఉన్నాడేమోనని భయంతో ప్రాణాలు అరచేత పెట్టుకుని ప్రక్క ఊరు చేరగానే దిగిపోయి అతని చేతిలో డబ్బులుంచి 'అమ్మయ్య' అనుకొని ప్రాణాలు కుదుట పర్చుకున్నాం.

మరునటి రోజు తెల్లవారగానే మావారు స్కూటరుని పందర్శించటానికి వెళ్ళేరు. పెళ్ళి ఇంట్లో చిత్తుగా వాడేసేరు. పెట్రోలు అయిపోతే రిజర్వ్ ఓపెన్ చేసి అదికూడా కొంత కానిచ్చేయబట్టి మాకీగతి పట్టిందని తెలుసుకుని స్కూటర్లో పెట్రోలు పోయించుకుని వచ్చేరు. తరువాత అంతా సుఖంగానే జరిగింది. మేమింత ఆందోళన పడుతుంటే తనకేమీ పట్టనట్టు నిశ్చింతగా ఉంది మా స్కూటరు. ఇంటికిచేరినతర్వాత సంగతి అంతా చెప్తే మా ఆందోళన విని అందరూ నవ్వడమే. అప్పటినుంచి రాత్రి పూట ప్రయాణాలు మానేశాము.